క్లుప్తంగా

డ్రోన్స్ స్టోర్ ప్రారంభం



డ్రోన్ స్టోర్‌ను ప్రారంభిస్తున్న జేడీఏ, తదితరులు

ఒంగోలు సెంట్రల్: అగ్రికల్చర్ మారుత్ డ్రోన్స్ స్టోర్‌ను గురువారం ఒంగోలులో ప్రారంభించారు. జిల్లా జేడీ శ్రీనివాసులు కార్యాలయాన్ని ప్రారంభించగా, వక్తలు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో డ్రోన్ ప్రాధాన్యతను గుర్తించి రైతులకు అందుబాటులో ఉండే విధంగా సేవలందించేలా మారుత్ డ్రోన్స్ పనిచేస్తుందని చెప్పారు. ఏడీఏ రమేష్, ఎక్స్‌ట్రీం రోబోటిక్స్ సహ వ్యవస్థాపకుడు రాకేష్ జెట్టి రోబోటిక్ డ్రోన్ ప్రాధాన్యతను వివరించారు.

స్మారక చిహ్నాలు చరిత్రకు సజీవ సాక్ష్యాలు

ఒంగోలు సెంట్రల్: భారతదేశం అపారమైన చారిత్రక వైభవాన్ని, సుసంపన్నమైన సాంస్కృతిక వైవిధ్యాలను కలిగి ఉందని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ డి.వెంకటేశ్వరరెడ్డి అన్నారు. ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా స్థానిక ఏకే విశ్వవిద్యాలయంలో గురువారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకే డీన్ డాక్టర్ డి.వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ అనేక అద్భుతమైన కట్టడాలు, అపురూపమైన కళాఖండాలకు దేశం నిలయమని అన్నారు. స్మారక చిహ్నాలు చరిత్రకు సజీవ సాక్ష్యాలని, అవి మనకు వారసత్వంగా లభించిన సంపదలని తెలిపారు. వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మన దేశంలో 40 చారిత్రక కట్టడాలు, ప్రదేశాలను యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశాలుగా గుర్తించిందని తెలిపారు.

రాజీనామా చేసిన ఘడియపూడి వలంటీర్లు



ఎంపీడీఓ శ్రీహరికి రాజీనామా పత్రాలు అందిస్తున్న ఘడియపూడి వలంటీర్లు

మద్దిపాడు: మండలంలోని ఘడియపూడి వలంటీర్లు మరో ముగ్గురు గురువారం తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓ శ్రీహరికి అందజేశారు. వలంటీర్ల పట్ల ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు తట్టుకోలేక రాజీనామాలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు కోసం పనిచేయడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. రాజీనామా చేసిన వారిలో బోడిపోగు మహేష్, ఆబోతు రవీందర్, కళతోటి వెంకటేష్ ఉన్నారు.

11 ఉన్నత పాఠశాలలు అప్‌గ్రేడ్

● జిల్లా విద్యాశాఖాధికారి సుభద్ర

ఒంగోలు సెంట్రల్: జిల్లాలో 11 కో ఎడ్యుకేషన్ ఉన్నత పాఠశాలలను అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర తెలిపారు. ఆయా 11 హైస్కూల్స్‌లో ఇంటర్మీడియెట్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ కోర్సులు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రతి కోర్సుకు 40 మంది విద్యార్థులకు అడ్మిషన్స్ ఇవ్వనున్నట్లు చెప్పారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైభవంగా రాములవారి ఊరేగింపు

బేస్తవారిపేట: స్థానిక పట్టాభిరామస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతా, రాముల వారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై ఉంచి ఊరేగించారు. బాణసంచా కాల్చుతూ, డీజే, కోలాట భజనలతో వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. ఆలయ కమిటీ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేస్తాం

● ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని సతీమణి శచీదేవి



వడ్డెపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బాలినేని శచీదేవి

ఒంగోలు: ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఆరోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించి సిక్సర్ కొట్టే అవకాశం ఇవ్వాలని, ఒంగోలు నియోజకవర్గాన్ని గొప్పగా అభివృద్ధి చేస్తామని ఆయన సతీమణి బాలినేని శచీదేవి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నగరంలోని 24వ డివిజన్ పరిధిలో గురువారం సాయంత్రం మహిళలతో మమేకం–స్త్రీశక్తితో శచీదేవి కార్యక్రమంలో భాగంగా ఆమె పర్యటించారు. వడ్డిపాలెం, వంటవారికాలనీలో ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా శచీదేవి మాట్లాడుతూ 24వ డివిజన్‌లో సుమారు రూ.6 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేశామన్నారు. నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేశామన్నారు. రోడ్లు, మురుగు కాలువలు నిర్మించామని, ఫిష్ మార్కెట్‌ను అభివృద్ధి చేశామని వివరించారు. డివిజన్‌లోని 624 మందికి ఇళ్ల స్థల పట్టాలను రిజిస్ట్రేషన్ చేసి మరీ ఇచ్చామని తెలిపారు. ఇంకా 94 మందికి ఇళ్ల స్థల పట్టాలు సిద్ధంగా ఉన్నాయని, ఎన్నికల కోడ్ కారణంగా ఇవ్వలేదని, ఎన్నికలైన వెంటనే ఇస్తామని తెలిపారు. అభివృద్ధికి మారుపేరే వాసన్న అని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి ఆయనకు మరో అవకాశం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. డివిజన్‌లో చేసిన అభివృద్ధిని వివరిస్తూ ప్రజా సమస్యలు తెలుసుకుంటూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పేదల పక్షపాతి అయిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, అప్పుడే పేదలకు సంక్షేమ పథకాలు నిరంతరాయంగా వస్తాయని తెలిపారు. ప్రతిపక్షాలు చెప్పే కల్లబొల్లి మాటలు నమ్మవద్దని కోరారు. మే 13వ తేదీ జరిగే ఎన్నికల పోలింగ్‌లో ఒంగోలు ఎమ్మెల్యేగా బాలినేని శ్రీనివాసరెడ్డిని, ఒంగోలు ఎంపీగా చెవిరెడ్డి భాస్కరరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు వైఎస్సార్ సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక కార్పొరేటర్ బేతంశెట్టి శైలజ డివిజన్‌లో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఏ సమస్య వచ్చినా వాసన్న సహకారంతో పరిష్కరిస్తానని ప్రజలకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు తోట సత్యం, డివిజన్ ఎన్నికల ఇన్‌చార్జి బాలిశెట్టి నాగేశ్వరరావు, పశుసంవర్ధకశాఖ చైర్మన్ రాధ, మాజీ కౌన్సిలర్ ఝాన్సీ, తూము పద్మ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



బూచేపల్లి సుబ్బారెడ్డికి నివాళులర్పిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాదరెడ్డి, నాయకులు

తండ్రికి నివాళులర్పించిన బూచేపల్లి

● మద్దతుగా హాజరైన మంత్రి మేరుగు, పార్టీ నాయకులు

చీమకుర్తి: వైఎస్సార్ సీపీ దర్శి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి గురువారం దర్శిలో నామినేషన్ వేసే ముందు చీమకుర్తిలోని బూచేపల్లి ఘాట్‌లో తన తండ్రి, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి సుబ్బారెడ్డికి కుటుంబ సభ్యులతో కలిసి ఘనంగా నివాళులర్పించారు. తన తండ్రి ఆశయాలను గుర్తు చేసుకున్నారు. ఆ సమయంలో శివప్రసాదరెడ్డి తల్లి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ భావోద్వేగానికి గురై కొడుకు శివప్రసాదరెడ్డిని హత్తుకున్నారు. బూచేపల్లి శివప్రసాదరెడ్డికి మద్దతుగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మేరుగు నాగార్జున హాజరవగా, చీమకుర్తి మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యకర్తను కోల్పోవడం బాధాకరం

● మంత్రి మేరుగు నాగార్జున



శేషయ్యకు నివాళులర్పిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున, నాయకులు

మద్దిపాడు: వైఎస్సార్ సీపీ నిబద్ధత కలిగిన కార్యకర్తను కోల్పోవడం బాధాకరమని మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. మద్దిపాడు సమీపంలోని ఘడియపూడి కాలనీలో నివాసం ఉంటూ ఈ నెల 3వ తేదీ పెన్షన్ తీసుకుని ఎండ వేడిమి తట్టుకోలేక మృతిచెందిన బొమ్మల శేషయ్య దశదిన కర్మ కార్యక్రమానికి గురువారం మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబానికి పార్టీ అండగా నిలుస్తుందన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మండవ అప్పారావు, ప్రధాన కార్యదర్శి, ఎంపీటీసీ వాకా కోటిరెడ్డి, వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకట్రావు, సీనియర్ నాయకులు నారా సుబ్బారెడ్డి, పూనాటి చిన్న అప్పారావు, రాయపాటి విల్సన్, అన్వేష్, మాజీ సర్పంచ్ జయమ్మ, మస్తానమ్మ, ఘడయపూడి సర్పంచ్ బొమ్మల రామాంజనేయులు, తదితర నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరామ మహాసామ్రాజ్య పట్టాభిషేకం



స్వామివారికి కిరీట ధారణ చేస్తున్న ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి



హారతి ఇస్తున్న బాలినేని

● పాల్గొన్న ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు మెట్రో: శ్రీరామనవమి సందర్భంగా నిర్వహిస్తున్న వసంత నవరాత్రుల్లో భాగంగా గురువారం స్థానిక పీవీఆర్ గరల్స్ హైస్కూల్ గడియారంవారివీధిలో ఉన్న అనంత కోదండరామస్వామి ఆలయంలో శ్రీరామ మహా సామ్రాజ్య పట్టాభిషేకం వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఒంగోలు బ్రాహ్మణ సేవాసమితి ఆధ్వర్యంలో ఉదయం ఎనిమిది గంటలకు ఆలయ అర్చకులు రాములవారి అష్టోత్తర శతనామావళి పూజ, హారతి, మంత్రపుష్పం, భక్తులకు సర్వదర్శనం కల్పించారు. రాత్రి ఏడు గంటలకు చక్కగా అలంకరించిన వేదికపై సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులను ఉంచి చక్కని వస్త్రాలతో అలంకరించి వివిధ రకాల పూలతో అలంకరణ చేశారు. వేద పురోహితుడు రాజేష్శర్మ ముందుగా గణపతి పూజ, మండపారాధన నిర్వహించారు. అనంతరం శ్రీరామ పట్టాభిషేకాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు.

కిరీట ధారణ గావించిన ఎమ్మెల్యే బాలినేని...

కార్యక్రమంలో మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పాల్గొని శ్రీరామ మహా సామ్రాజ్య పట్టాభిషేకంలో ఆశీనులైన సీతారామలక్ష్మణ స్వామివారి దర్శనం చేసుకుని పూజలో పాల్గొన్నారు. బాలినేని కరకమలములతో స్వామివారికి కిరీట ధారణ గావించారు.

కార్యక్రమంలో ఒంగోలు బ్రాహ్మణ సేవా సమితి ఉపాధ్యక్షుడు మహంకాళి శేషయ్య, సభ్యులు మైనంపాటి సాయికుమార్, మద్దులూరి హరిప్రేమనాథ్, పూర్ణచంద్రరావు, ఆలయ వంశపార ధర్మకర్త గడియారం సుబ్బయ్యశర్మ, కార్పొరేటర్ గిరిజాశంకరశాండిల్య, నీలంరాజు సరోజ, బ్రాహ్మణ పెద్దలు ఉప్పుగుండూరు శ్రీనివాసరావు, గూడా రామ్మోహన్, గడియారం సుధాకరశర్మ, పోలూరు జ్వాలాపతి, వేణుగోపాల్, కరవది రాఘవరావు, మహంకాళి మురళీకృష్ణ, నిర్మల్, తదితరులు పాల్గొన్నారు. స్థానిక భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించి అర్చకస్వామిచే వేద ఆశీర్వచనం అందుకున్నారు.

మంగమూరు రోడ్డు జెడ్పీ కాలనీలో...

జెడ్పీ కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ఏడు గంటలకు ప్రముఖ జ్యోతిష్య వాస్తు సిద్ధాంతి ఆగస్త్యరాజుశివ శ్రీరామ నవమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి టీడీపీ గ్రామ అధ్యక్షుడు



తేజమోహన్‌రెడ్డి, గోపిని వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి, చెవిరెడ్డి భాస్కరరెడ్డి

● పార్టీ కండువాలు వేసి ఆహ్వానించిన చెవిరెడ్డి భాస్కరరెడ్డి, బాలినేని శ్రీనివాసరెడ్డి

కొత్తపట్నం: ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన బాగుందని, పేద, బడుగు, బలహీనవర్గాలకు పథకాలు ఉపయోగపడుతున్నాయని గుర్తించి వైఎస్సార్ సీపీలోకి రావడం జరిగిందని గాదె తేజమోహన్‌రెడ్డి అన్నారు. టీడీపీ గాదెపాలెం గ్రామ అధ్యక్షుడుగా ఉన్న ఆయన.. గత మంగళవారం కొత్తపట్నంలో నిర్వహించిన వైఎస్సార్ సీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి పరిచయ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీలో చేరారు. చెవిరెడ్డి భాస్కరరెడ్డితో పాటు ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి పార్టీ కండువాలు వేసి వైఎస్సార్ సీపీలోకి తేజమోహన్‌రెడ్డి, మిండాల గోపిని ఆహ్వానించారు. పార్టీ గెలుపు కోసం తన వంతు కృషి చేస్తానని వారు అన్నారు. టీడీపీ అరాచకాలు చూడలేక, ఆ పార్టీలో గౌరవం లేక వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు డాక్టర్ చెరుకూరి వీరరాఘవరావు, ములకా రామిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

తొలిరోజు ఒకే ఒక నామినేషన్

చీమకుర్తి: సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గం (ఎస్సీ)లో గురువారం నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. మొదటి రోజు బీఎస్పీ తరఫున కైలా వెంకట్రావు నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి గోపాలకృష్ణకు అందించారు. ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు ఎవరూ నామినేషన్లు దాఖలు చేయలేదు.

సంక్షేమ పథకాలు కావాలంటే జగనన్నకే ఓటేయాలి



4వ డివిజన్ ఇస్లాంపేట రిక్షాల బజార్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న బాలినేని శ్రీకావ్య

ఒంగోలు టౌన్: అవ్వాతాతలకు పింఛన్లు, అక్కాచెల్లెమ్మలకు చేయూత, భరోసా, చిన్నారులకు అమ్మ ఒడి, అన్నదాతలకు రైతు భరోసా, తదితర పథకాలన్నీ కొనసాగాలంటే మళ్లీ జగనన్నకే ఓట్లేసి గెలిపించాలని బాలినేని శ్రీకావ్య కోరారు. గురువారం నగరంలోని 4వ డివిజన్‌లో ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జగనన్నకు ఓటేస్తే పేదల ప్రభుత్వం మళ్లీ వస్తుందని, చంద్రబాబుకు ఓటేస్తే పేదలను పీడించే రాక్షస ప్రభుత్వం వస్తుందని శ్రీకావ్య అన్నారు. ఒంగోలులో ఒక్క గుడిసె కూడా కనిపించకూడదన్న లక్ష్యంతో ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి 25 వేల మందికి ఇళ్ల స్థల పట్టాలు పంపిణీ చేశారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో మీ ఆశీసులతో మళ్లీ గెలిచి ప్రతిఒక్కరికీ ఇల్లు నిర్మించి ఇస్తారన్నారు. ఒంగోలు నియోజకవర్గంలో కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని, ఈ పథకాలన్నీ కొనసాగించేందుకు ఫ్యాన్ గుర్తుకు ఓట్లేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా శ్రీకావ్యకు ముస్లిం మహిళలు, స్థానికులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. అడుగడుగునా హారతులిచ్చారు. వారితో కాసేపు ముచ్చటించిన శ్రీకావ్య ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఒంగోలు నియోజకవర్గంలో బాలినేని శ్రీనివాసరెడ్డి చేసిన అభివృద్ధి, రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓట్లేసి వైఎస్సార్ సీపీని భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ జలీల్, డివిజన్ కార్పొరేటర్ నూర్జహాన్, వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు కాలేషా, రాచమల్లు బ్రహ్మారెడ్డి, ఖాదర్, బాబు, రఫీ, అబిద్, హయతి, ఆసిమ్, రబ్బాని, కరిముల్లా, బాజీ, సాదిక్, మౌలా, షకీలా, కరాటి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దిన ఉపాధ్యాయుడు.. యలమంద

● ఎంఈఓలు ఆంజనేయులు, శ్రీనివాసరావు



యలమందను సన్మానిస్తున్న ఎంఈఓలు, హెచ్ఎం, ఉపాధ్యాయులు

మద్దిపాడు: విద్యార్థులను తీర్చిదిద్దిన ఉపాధ్యాయుడు పసుపులేటి యలమంద అని ఎంఈఓలు ఎంవీఆర్ ఆంజనేయులు, ఎం.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గుండ్లాపల్లి జెడ్పీ హైస్కూల్లో తెలుగు ఉపాధ్యాయుడు పసుపులేటి యలమంద మాస్టర్ పదవీ విరమణ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎంఈఓలు మాట్లాడుతూ యలమంద మాస్టర్ గత 12 సంవత్సరాలుగా గుండ్లాపల్లి పాఠశాలలో పలువురు విద్యార్థులను తీర్చిదిద్ది వారి ఉన్నతికి కారణమయ్యారన్నారు. ఆయన మంచి మనసుతో పాఠశాలలో జరిగే ప్రతి అభివృద్ధి కార్యక్రమంలో పాలుపంచుకుంటూ అందరితో కలివిడిగా ఉండే వ్యక్తి అని అన్నారు. ఆయన ఉద్యోగ విరమణ చేయడం ఇబ్బందికరంగా అనిపించినా.. ప్రతి ఉద్యోగి పదవీ విరమణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం యలమంద మాస్టర్‌ను సతీ సమేతంగా సన్మానించారు. పాఠశాల హెచ్ఎం ప్రభాకర్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం



ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూమి

సంతనూతలపాడు (చీమకుర్తి): సంతనూతలపాడు మండలం మిట్టమీద పాలెం (టపాచెట్టు) వద్ద సర్వే నంబర్ 365లో గల ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు మండలానికి చెందిన ప్రతిపక్ష పార్టీ నాయకులు ప్రయత్నిస్తున్నారు. ఆ స్థలంలో ఏళ్ల నాటి నుంచి ఉన్న వృక్షాలను సైతం నరికివేస్తూ సదరు స్థలాన్ని కబ్జా చేయాలని చూస్తున్నారు. ప్రస్తుతం ఎన్నికల సమయం కావడం, మండలంలో విధులు నిర్వహిస్తున్న అధికారులు ఇతర జిల్లాల నుంచి రావడం, స్థానిక పరిస్థితులపై అవగాహన లేకపోవడంతో ఇదే అదునుగా భావించారు. దీనికితోడు ప్రస్తుతం ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ మొదలవడంతో ఎవరూ పట్టించుకోరనే ధీమాతో భూకబ్జాకోరులు సదరు స్థలం కబ్జాకు అడ్డుగా ఉన్న ఏళ్ల నాటి భారీ వృక్షాలను అనుమతి లేకుండానే కొట్టివేశారు. దీనిపై స్థానికుల నుంచి తీవ్రస్థాయిలో విమర్శలు వినిపిస్తున్నప్పటికీ.. అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకుని ప్రభుత్వ భూమి కబ్జాకు గురవకుండా కాపాడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

మార్కాపురం విద్యార్థికి 5వ ర్యాంకు



విద్యార్థికి బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసబాబు, సురేష్‌బాబు

మార్కాపురం టౌన్: పట్టణ సమీపంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో చదువుతున్న పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయి ఒలింపియాడ్ ఇంగ్లిష్ పోటీల్లో 5వ ర్యాంకుతో పాటు జిల్లాస్థాయి ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపాల్ టీఎం శ్రీనివాసబాబు, ఇంగ్లిష్ లెక్చరర్ బి.సురేష్ గురువారం తెలిపారు. గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న ఎస్.వెంకట అంజి రాష్ట్రస్థాయి 5వ ర్యాంకు, టి.వెంకటరావు జిల్లా మొదటి ర్యాంకును సాధించాడు. 9వ తరగతి చదువుతున్న డి.వెంకటరావు జిల్లా రెండో ర్యాంకును సాధించినట్లు పేర్కొన్నారు. విజేతలైన విద్యార్థులకు గురువారం సురేష్‌బాబు బహుమతులు అందించారు.